క్లుప్తంగా

వినాయకుని సేవలో శైలజాచరణ్ రెడ్డి



శైలజాచరణ్ రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న సూపరింటెండెంట్

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర మహిళ శిశు సంక్షేమశాఖ రాయలసీమ రీజినల్ చైర్ పర్సన్ శైలజాచరణ్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆమె తన జన్మదినం సందర్భంగా దంపతులిద్దరూ స్వామి వారి దర్శనార్థంగా విచ్చేయగా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పుష్పపల్లకి



పుష్పపల్లకిలో అమ్మవారు

చిత్తూరు రూరల్: గంగజాతరను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీదుర్గాంబ దేవస్థానంలో శుక్రవారం పుష్పపల్లకి సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. వేకువజామున మూలస్థానంలోని అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. ఉదయం భక్తులచే 1008 బిందెలతో మహాజలాభిషేకం చేపట్టారు. సాయంత్రం దుర్గమ్మకు విశేష పూజలు జరిపించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పుష్పపల్లకిలో అమ్మవారిని ఆశీనులు చేసి నగర వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపుగా వస్తున్న అమ్మవారు భక్తులకు కటాక్షిస్తూ కనువిందు చేశారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

అరగొండలో చలివేంద్రం



మజ్జిగ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రశాంతకుమార్

తవణంపల్లె: మండలంలోని అరగొండలో వేసవి దృష్ట్యా దాహం తీర్చుకోవడానికి స్థానిక సర్పంచ్ మల్లుదొరై ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. అరగొండలో ప్రజల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఎండలకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలు దాహం తీర్చుకోవడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రశాంతకుమార్ ప్రజలకు మజ్జిగ అందజేశారు.

ఈ మహిళ ఎవరో?



స్పృహ తప్పి పడిపోయిన మహిళ

యాదమరి: గుర్తు తెలియని మహిళ అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని కమ్మరాయని మిట్ట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుమన్ కథనం మేరకు చిత్తూరు వైపు నుంచి 40 ఏళ్ల మహిళ నడుచుకుంటూ యాదమరి వైపు బయల్దేరింది. శుక్రవారం ఉదయం కమ్మరాయని మిట్ట వద్ద కళ్లుతిరిగి పడిపోయింది. స్థానికులు గుర్తించి, ఆమెను వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కానీ ఇప్పటివరకు ఆ మహిళ మాట్లాడడం లేదు. ఆ మహిళను ఎవరైనా గుర్తుపడితే 9440900684ను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.



యాదమరి ఉన్నత పాఠశాల వద్ద చెట్ల కొమ్మల మధ్యలో ఉన్న విద్యుత్ తీగలు



ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వద్ద చెట్టు కొమ్మల మధ్య విద్యుత్ తీగలు

వానొస్తే కరెంట్ కట్

- విద్యుత్ శాఖలో నిర్లక్ష్యం
- సబ్‌స్టేషన్‌కు విద్యుత్ రిటర్న్ సప్లయ్
- అడిగినా సమాధానం చెప్పేవారు లేరు

- రైతు: సార్ సబ్‌స్టేషనా.. యాదమరిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి చాలా సేపయింది సార్.
- సిబ్బంది: అవునయ్యా ట్రిప్ అయింది. ఇస్తాం కానీ..
- రైతు: ఎందుకు సార్ ఉదయం నుంచి కరెంట్ తీసేశారు కదా.. ఇప్పటివరకూ బాగు చేయలేదా?
- సిబ్బంది: యోవ్... అవన్నీ చెప్పలేం. మీకే కాదు మండలంలో చాలా ప్రాంతాల్లో కరెంట్ లేదు.. ఎందుకు విసిగిస్తారు, ఫోన్ పెట్టండి మీతో మాకు పెద్ద సమస్యగా ఉంది.
- రైతు: హలో సార్ లైన్‌మేనా... ఉదయం నుంచి కరెంట్ లేదు సార్ ఉక్కపోతతో అల్లాడుతున్నాం. కరెంట్ ఎప్పుడు వస్తుంది సార్.
- లైన్‌మన్: వస్తుంది.... ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెయింటెనెన్స్ కోసం ఆపేశాం.. మళ్లీ ఇస్తాం..
- రైతు: సార్ ఇప్పటికి సాయంత్రం 6 గంటల అవుతుంది ఇంకా కరెంట్ రాలేదు.
- లైన్‌మన్: ఇచ్చాం.. ఎక్కడో విద్యుత్ స్తంభంలో సమస్య ఉంది. చూస్తున్నాం. కాసేపు ఉండండీ ఏమీ చేయలేం..

ఇదీ విద్యుత్ అధికారుల సమాధానాలు

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం వేసవిలోనూ విద్యుత్ సరఫరాలో కోతలు లేకుండా చూడాలని ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. చాలా మండలాల్లో ఆ ప్రణాళిక ప్రకారం విద్యుత్ సమస్యలేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకెళుతున్నారు. అయితే ఈ మండలంలో మాత్రం వానొస్తే కరెంట్ పోతోంది. విద్యుత్ సిబ్బంది, అధికారులు ప్రజలకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. కరెంట్ ఎప్పుడు పోతోందో తెలియదు. అడిగితే సరిగ్గా సమాధానం చెప్పరు. ఎవరు ఫోన్ చేసినా, ఇస్తాం ఉండయ్యా అంటూ సమాధానమిస్తారు. మండలంలో 26 పంచాయతీల్లో 197 గ్రామాలు ఉన్నాయి. వీటికి విద్యుత్ సరఫరా ఇవ్వడానికి బుడితరెడ్డి పల్లె, జోడి చింతల, ముద్దురామాపురం సబ్ స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. కానీ విద్యుత్‌శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా 33 కేవీ, 11 కేవీ విద్యుత్ వైర్లు మార్పులు చేస్తుండడంతో, చిన్నగాలి వచ్చినా, చిరు జల్లులు కురిసినా కరెంట్ కట్ అయిపోతోంది. ఈ సమస్యలను గుర్తించడానికి ఇక్కడున్న సిబ్బందికి ఒక రోజంతా సరిపోవడం లేదు. ఇక్కడ అనుభవం, నైపుణ్యం, అవగాహన ఉన్న అధికారులు కానీ, సిబ్బంది కానీ లేకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి.

ఇక్కడ రోజూ నిర్వహణ పేరుతో కట్

మండలంలో ప్రతి నెలా రెండో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. విద్యుత్‌వైర్లు ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం కానీ, వేలాడుతున్న తీగలను సరిదిద్దడం కానీ సక్రమంగా చేయడంలేదు. మధ్యాహ్నం 2 గంటలైతే ఎక్కడి పనులు అక్కడే ఆపేసి వెళ్లిపోతున్నారు. విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలు సక్రమంగా తొలగించకపోవడంతో రాత్రి సమయాల్లో చిన్న గాలి వీచినా, వర్షం కురిసిన కరెంట్ నిలిచిపోతోంది. ఈ సమస్య గుర్తించడానికి వర్షం కురిసిన తరువాత రోజంతా సరిపోతుంది. అయినా సమస్య మాత్రం పరిష్కారం కాదు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు.

సరిపడా సిబ్బంది లేరు

యాదమరి మండలంలో విద్యుత్‌శాఖలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా ఉన్నారు. వీరిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. త్వరలో నిపుణులైన, సమర్థులైన సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటాం. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తాం. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరిస్తున్నాం.

– గుర్రప్ప, విద్యుత్‌శాఖ ఏఈ, యాదమరి మండలం

గత వారంలో మూడు రోజుల పాటు వర్షం కురుస్తూనే ఉండడంతో రాత్రి పగలు లేకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అంతేగాక మండల పరిధిలో 33 కేవీ, 11 కేవీ వైర్లు ఇష్టారాజ్యంగా ఫ్యాక్టరీలకు లాగడంతో సబ్ స్టేషన్‌లో విద్యుత్ రిటర్న్ సప్లయ్ రావడం గమనార్హం. దీంతో ఇప్పటికే ముగ్గురు సిబ్బంది మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ రిటర్న్ సప్లయ్ కావడంతో పూర్తిగా కాలిపోయి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం రేపు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

చిత్తూరు రూరల్: తిరుపతి మహతి ఆడిటోరియంలో వీరబ్రహ్మేందస్వామి గోవింద మాంబల కల్యాణోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు చిత్తూరు స్వర్ణకార సంఘ, విశ్వబ్రహ్మణ సంఘ సభ్యులు తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం ఉదయం 7 గంటలకు తిరుపతి మహతి ఆడిటోరియంలో కల్యాణోత్సవం ప్రారంభమవుతుందన్నారు. పతాకావిష్కరణ, హోమం, కలశాభిషేక పూజలు జరుగుతాయన్నారు. 12 గంటలకు తిరుకల్యాణం, 4 గంటలకు ఉపన్యాసం ప్రారంభమవుతుందన్నారు. భక్తులందరూ పాల్గొని ఈ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చంద్రశేఖర్ ఆచ్చారి, శీతాపతి, శివకుమార్, రవి, సురేష్, విజయ, శరవణ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో జిల్లా జట్టుకు విద్యార్థిని ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని రుక్మిణి కృష్ణస్వామి (ఆర్.కే) కళాశాలలో చదువుతున్న కౌసల్య ఖోఖో జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యమిస్తామన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. తమ కళాశాల విద్యార్థిని జిల్లా జట్టులో ఎంపికై ఈ నెల 20, 21, 22 తేదీల్లో విజయనగరం జిల్లాలో నిర్వహించే అంతరాష్ట్ర ఖోఖో పోటీల్లో పాల్గొంటుందన్నారు.

22 నుంచి వజ్రాలపురం జాతర



వజ్రాలపురం బోయకొండ గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురంలో వెలసిన శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మ 24వ జాతర ఈ నెల 22వ తేదీ సోమవారం నుంచి 24వ తేదీ బుధవారం వరకు మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప శుక్రవారం తెలిపారు. జాతర కార్యక్రమంలో భాగంగా 22వ తేదీ ఉదయం కలశ స్థాపన, ధ్వజారోహణ, గణపతి హోమం, చండీ హోమం, 10 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు భజన కార్యక్రమం, 12 గంటల అన్నదానం, సాయంత్రం 6.30 గంటలకు పాల్‌రాజ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో జబర్దస్త్ టీం వారిచే కామెడీషో, ఆర్కెస్ట్రా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 23వ తేదీ మంగళవారం ఉదయం గంగమ్మ నిజరూప దర్శనం, 10గంటలకు అంబలి, పొంగలి, 12 గంటలకు అన్నదానం, సాయంత్రం బెంగళూరు దయానంద మెలోడియస్ వారిచే సినీ తారలచే డ్యాన్స్ కార్యక్రమం, 24వ తేదీ బుధవారం ఉదయం అమ్మవారి ప్రత్యేక అలంకరణ, పూజలు సాయంత్రం 3.15 గంటలకు అమ్మవారిని విశేషంగా అలంకరించి వెండితేరుపై కొలువుదీర్చి అమ్మవారి సన్నిధి నుంచి బొమ్మాయిపల్లె, కురప్పల్లె, తిమ్మోజుపల్లె, మాధవనగర్, బంగారుపాళెం, తగ్గువారిపల్లె, కొత్తపల్లె, కరిడివారిపల్లె, రామానాయుడుపాళెం మీదుగా వజ్రాలపురం వరకు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో వైభవంగా ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

18 ఏళ్లు నిండితే ఓటరుగా నమోదు చేయాలి

తవణంపల్లె: మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ పర్వీన్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఓటరు నమోదు కార్యక్రమంపై బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈఆర్‌ఓ పర్వీన్ మాట్లాడుతూ 6, 7 క్లెయిమ్‌లను సకాలంలో విచారణ చేసి తహసీల్దార్ కార్యాలయానికి సమర్పించాలన్నారు. బీఎల్‌ఓలు ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ నంబరు అనుసంధానం చేయించాలి. 25వ తేదీ లోపల ఇంటింటికీ తిరిగి విచారణ చేసి ఓటర్లకు సంబంధించి వివరాలను నిర్ణీత ఫారంలో నమోదు చేయించి అందజేయాలని ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తుగా సిబ్బంది సిద్ధంగా ఉండి తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల డీటీ మహేశ్వరి, తవణంపల్లె డీటీ నరేష్, భూ రీసర్వే డీటీ వెంకటరమణ, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలు

యాదమరి: మండల కేంద్రంలోని త్రివేణి సంఘమంలో వెలసిన ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. యాదమరిలో మూడు నదులు గంగ, యమున, సరస్వతి మూడు నదులు కలిసే చోట వెలసిన ఇంద్రవరదుని ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆదివారం అంకురార్పణతో శాస్త్రోక్తంగా ప్రారంభించనున్నారు.

- బ్రహ్మోత్సవాల వివరాలు

21న ఆదివారం
- ఉదయం – అభిషేకం, విష్వక్సేన ఉత్సవం
- రాత్రి – అభిషేకం, బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

22న సోమవారం
- ఉదయం – బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం
- రాత్రి – చంద్రప్రభ వాహనం

23న మంగళవారం
- ఉదయం – సప్రం ఉత్సవం, అలంకార అభిషేకం
- రాత్రి – హంస వాహనం

24న బుధవారం
- ఉదయం – సప్రం ఉత్సవం, అలంకార అభిషేకం
- రాత్రి – యాళివాహనం



శ్రీదేవి, పెరుందేవి సమేత ఇంద్రవరదుడు ఉత్సవ మూర్తులు

25న గురువారం
- ఉదయం – సూర్యప్రభ వాహనం, అలంకార అభిషేకం
- రాత్రి – శేష వాహనం

26న శుక్రవారం
- ఉదయం – గరుడోత్సవం
- రాత్రి – కల్పవృక్ష వాహనం

27న శనివారం
- ఉదయం– హనుమంతు వాహనం
- సాయంత్రం – నాచ్చియార్ తిరుక్కోళం, కల్యాణోత్సవం
- రాత్రి – ఏనుగు వాహనం

28న ఆదివారం
- ఉదయం మూలవర్లకు అలంకార అభిషేకం
- మధ్యాహ్నం – రథోత్సవం
- రాత్రి – తేరుమెట్లు ఉత్సవం, తోట ఉత్సవం

29న సోమవారం
- ఉదయం – అలంకార అభిషేకం
- సాయంత్రం – వెణ్ణాత్తాయ్ కణ్ణన్ తిరుక్కోలం
- రాత్రి – అశ్వవాహనం

30న మగంళవారం
- ఉదయం – అలంకార అభిషేకం
- మధ్యాహ్నం – తీర్థవారి
- సాయంత్రం– పుణ్యకోటి విమానం
- రాత్రి – ధ్వజావరోహణం

31న బుధవారం
- ఉదయం – అలంకార అభిషేకం
- రాత్రి – ద్వాదని ఆరాధన, పుష్పపల్లకి సేవ

జూన్1న గురువారం
- రాత్రి – వడాయితోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగింపు

మహిళాభ్యున్నతే సీఎం లక్ష్యం



లబ్ధిదారునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: మహిళాభ్యున్నతే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని వావిల్‌తోట పంచాయతీ పరిధిలో శుక్రవారం నయనంపల్లి, ఎగువకండ్రిగ, దిగువ కండ్రిగ, వీర్లగుడిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు 400 గడపలను తిరిగి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా..లేదా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పథకాల ద్వారా లబ్ధి పొందిన వారికి బుక్‌లెట్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా కుల, మత, వర్గ పార్టీలకు అతీతంగా పథకాల లబ్ధిని అర్హులందరికీ అందిస్తున్నారన్నారు. అమ్మఒడి నుంచి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. రాబోయే పాతికేళ్లు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని చెప్పారు.

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

వావిల్‌తోటలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలువురు అర్జీలతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కాలువ, రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ఇళ్ల స్థలాలు వంటి సమస్యలతో గ్రామస్తులు కలవగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే బదిలీలపై పక్క మండలాలకు వెళ్లాల్సి వస్తుందని వెళతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ కుమారి, వైస్‌ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, జెడ్పీటీసీ దేవిక, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, సర్పంచ్ మహేశ్వరి, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్‌ఐ హరిప్రసాద్, సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కట్టకిందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్



ఉప్పాంకలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి మోహన్‌వేలు

ఐరాల: మండలంలోని కట్టకిందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం 104 వైద్య శిబిరంలో 130 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని పరీక్షలు నిర్వహించారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉప్పాంకలో వైద్య సేవలు

తవణంపల్లె: మండలంలోని చెర్లోపల్లె సచివాలయం పరిధిలోని ఉప్పాంకలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు 67 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, నీరజ, ఎంఎల్‌హెచ్‌పీ సుమియాడి, డీఈఓ విజయలక్ష్మి, ఆశావర్కర్లు మీనా, గంగ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు ఆరోగ్య వైద్యాధికారి తెలిపారు. శుక్రవారం మండలంలోని మైనగుండ్లపల్లెలో పరిసరాల శుభ్రత, డ్రైడే ఫ్రైడేపై అవగాహన కల్పించారు. గుంతల్లో నీరు నిల్వ చేరడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని వివరించారు. అందువల్ల నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని, వేపాకు పొగ వేయాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని, చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరళకుమారి, అంగన్‌వాడీ వర్కర్ కవిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మైనగుండ్లపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న ఆరోగ్య వైద్యాధికారి రాజేంద్రకుమార్

18 రకాల వంటకాలతో అన్నదానం



అలరించిన నృత్య ప్రదర్శన

కుప్పం: తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా శుక్రవారం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. మహిళలు, భక్తులు భారీగా దేవస్థానానికి తరలివచ్చి అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయం ఎదుట చలువ పందిళ్ల కింద అన్నదానం చేశారు. కుప్పం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు 18 రకాల వంటకాలతో సంతృప్తికర భోజనాలను వడ్డించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జాతరను పురస్కరించుకుని గురువారం రాత్రి శ్రీదేవి డ్రామా కంపెనీ డ్యాన్సర్లతో ఏర్పాటు చేసిన డ్యాన్సు ప్రోగ్రాం చూపరులను ఆకట్టుకుంది. నెల్లూరు నుంచి వచ్చిన కళాకారులు చేసిన డ్యాన్సు, కామెడీ సభికులను అలరించింది. శుక్రవారం పల్సర్ బైక్ రమణ బృందంచే చేపట్టిన పాటకచ్చేరి, నృత్య కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం అమ్మవారి ఉత్సవ ఊరేగింపు జరిగింది. కార్యక్రమాల్లో రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, చైర్మన్ మంజునాథ్ పాల్గొన్నారు.





అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



పురుషోత్తం పార్థివదేహానికి గౌరవవందనం చేస్తున్న పోలీసు అధికారులు

ఐరాల: చిత్తూరు పీసీఆర్ కళాశాల వద్ద గురువారం ఏఆర్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పురుషోత్తం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన స్వగ్రామమైన బెస్తపల్లెలో శుక్రవారం అంత్యక్రియలను పోలీసులు అధికార లాంఛనాలతో నిర్వహించారు. జిల్లా ఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఆర్‌ఐ అడ్మిన్ నీలకంఠేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. దహన సంస్కరణలకు రూ.25 వేల ఆర్థిక సాయం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆర్‌ఐ అడ్మిన్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని, రావలసిన అన్ని ప్రయోజనాలను త్వరగా అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు.